సాక్షి
కుమురం భీం

సోమవారం, 2, సెప్టెంబర్, 2024



నిండు కుండలు..
భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు జలకళ నంతరించుకున్నాయి. నిండు కుండలను తలపిస్తున్నాయి. 8లో



రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..?
గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాలని వేడుకుంటున్నారు. 9లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 28.2 /24.2
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

ముసురుకున్న వాన

- జిల్లాలో రెండో రోజూ కొనసాగిన వర్షం
- అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసిన అధికారులు
- నేటి ప్రజావాణి రద్దు



కుమురంభీమ్(అడ) ప్రాజెక్ట్

ఆసిఫాబాద్: ఉత్తర బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా ముసురు వానలతో జిల్లా తడిసిముద్దైంది. వాగులు, వంకలూ పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఎగువన కురిసిన వర్షాలతో కుమురంభీమ్(అడ), వట్టివాగు ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టు అధికారులు గేట్లు ఎత్తారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా, తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ముందు జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లో ముందుజాగ్రత్తగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ పరిశీలించిన కలెక్టర్..
భారీ వర్షాలతో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులకు వెంటవెంటనే సమాచారం తెలియజేస్తూ, అప్రమత్తం చేస్తున్న తీరును తెలుసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతాలకు అధికారులను అప్రమత్తం చేయాలని, నిరంతరం 24/7 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావుకు సూచించారు. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో పూర్తి జాగ్రత్తతో ఉండాలన్నారు. వర్షాల వల్ల ఏవైనా ఇబ్బందులుంటే వెంటనే కంట్రోల్ రూమ్ నెం. 63046 86505కు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఎస్పీ సదయ్య సంబంధిత అధికారులున్నారు.

జిల్లాలో 44మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం..
భారీ వర్షాలతో జిల్లాలో ఆదివారం 44మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా రెబ్బెన మండలంలో 83.5మిల్లీ మీటర్లు కురిసింది. జైనూర్ 47.8, సిర్పూర్ యూ 40.4, లింగాపూర్ 45.1, తిర్యాణి 38.5, ఆసిఫాబాద్ 72.7, కెరమెరి 50.2, వాంకిడి 70, కాగజ్‌నగర్ 69.5, సిర్పూర్ టి 25.9, కౌటాల 24.6, చింతలమానెపల్లి 16.8, బెజ్జూర్ 27, పెంచికల్‌పేట్ 29.8, దహెగాం 17.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రజావాణి రద్దు..
భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దుతో పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్పా, బయటకు రాకూడదన్నారు. ప్రజల రక్షణ కోసం అధికార యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణ కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

కాగజ్‌నగర్ ఎఫ్‌డీవోగా సుశాంత్ సుఖ్‌దేవ్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ ఆఫీసర్‌గా బోబడే సుశాంత్ సుఖ్‌దేవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కార్తీక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ పరిస్థితి చాలా అధ్వానంగా మారిందని, కనీస సౌకర్యాలు లేక వసతిగృహం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. భోజనం నాసిరకంగా ఉంటుందని, మెనూ పాటించడం లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు టికనంద్, శ్రావణ్, సతీష్, శ్రావణి, నిఖిల్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఇంగ్లిష్-2, తెలుగు-01, కామర్స్-02, ఫిజిక్స్-01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు పీజీలో ఎస్సీ, ఎస్టీ 50 శాతం , ఇతరులకు 55 శాతం మార్కులు ఉండాలన్నారు. ఎస్‌ఈటీ, ఎస్‌ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ ఉన్నవారితోపాటు డిగ్రీ కళాశాల బోధన అనుభవానికి ప్రాధన్యత ఉంటుందన్నారు.అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో ఈనెల 3వ తేదీ వరకు దరాఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 4న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

బెల్లంపల్లి కాలేజీలో..
బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ తెలిపారు. కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్ టాక్సేషన్, బాటనీ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు, జువాలజీ విభాగంలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. సంబంధిత సబ్జెక్టులలో అభ్యర్థులు జీలో 55శాతం మార్కులతోపాటు పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4గంటల వరకు డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 6వ తేదీన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు, డెమో ఉంటాయని పేర్కొన్నారు.

పెన్షన్ భిక్ష కాదు..
ఉద్యోగి హక్కు

- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి
- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం లభించే పెన్షన్ భిక్ష కాదని.. అది వారి హక్కు అని ఉద్యోగ ఉపాధ్యాయుల సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీపీఎస్ లేదా ఓపీఎస్‌లలో ఏ విధానాన్ని అమలు చేస్తారో ఎంపిక చేసుకోమని కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చినప్పటికీ, ఉద్యోగులతో చర్చించకుండా అప్పటి ప్రభుత్వం సీపీఎస్‌కు మొగ్గు చూపిందని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోయం ఇందూరావ్, పెండ్యాల సదాశివ్, హేమంత్ షిండే, ఊశన్న, శ్రీనివాస్‌రావ్, లక్ష్మణ్, తుకారాం, కమర్, సునీల్, అమరేందర్, సంతోష్, రమేష్, ప్రభాకర్, చంద్రయ్య, ఉపేందర్, వసీం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- వరద ప్రభావిత పరిస్థితులు, రక్షణ చర్యలపై సమీక్ష

ఆసిఫాబాద్: భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆదివారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ డాక్టర్ జితేందర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వరద ప్రభావిత పరిస్థితులు, చేపట్టాల్సిన రక్షణ చర్యలపై సమీక్షించారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ, ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల వారీగా నెలకొన్న వరద పరిస్థితులు, చేపడుతున్న సహాయక చర్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునా, ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకూ, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైతే రాష్ట్రం నుంచి సహాయక బృందాలు పంపిస్తామని, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చే వరకు వేచి చూడకుండా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సేవలు వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26పోలీస్ బలగాలు అందుబాటులో ఉన్నాయని, చెరువులు, కుంటలు, వాగులు, రిజర్వాయర్ల వద్ద ఎవరూ వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాల వల్ల విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఎస్పీ సదయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్.. పెరుగుతున్నయ్..!

- రోజురోజుకూ పేషెంట్ల సంఖ్య పైపైకి..
- రెండింటితో బాధపడుతున్న వారు మరికొందరు
- ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం



గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆసిఫాబాద్అర్బన్: జీవన విధానం, పని ఒత్తిడి, ఉరుకులు పరుగుల జీవనం, తదితర కారణాలతో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య జిల్లాలో పెరుగుతూ పోతోందని వైద్యులు పేర్కొంటున్నారు. అధికారికంగా ఈ రెండు వ్యాధులతో బాధపడేవారి సంఖ్య 29,304ఉండగా, అనధికారికంగా 60వేలకు పైగానే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక్కరిలోనే రెండు వ్యాధులున్నవారు 1,203మంది ఉంటారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరికి ఏడాదిగా కాంబినేషన్ డ్రగ్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారానే ఈ రోగాల బారిన పడకుండా ఉండవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు.

25వేలకు చేరువలో పేషెంట్లు..
వైద్యారోగ్య శాఖ నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 21,492మంది బీపీ పేషెంట్లు ఉండగా, 7,812మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఈ రెండు కలిపి 29,304మంది ఉన్నారు. ఒక్కరిలోనే రెండు వ్యాధులున్నవారు 1,203మంది పైచిలుకు ఉన్నారు. వీరికి ప్రతినెలా ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. అయితే వాస్తవంలో ఈ గణాంకాలు రెండింతలు ఉండే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. చాలామంది ప్రభుత్వ సర్వేలకు చెప్పకుండా, ప్రైవేటుగా పరీక్షలు చేసుకొని మందులు వాడుతున్నట్లు తెలుస్తోంది. తమ రోగాన్ని బయటకు చెప్పుకోవడం ఇష్టంలేక సర్వేల్లో చెప్పలేని వారు సైతం ఇంతే మొత్తంలో ఉంటారని అంచనా వేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం షుగర్, బీపీ పేషెంట్లు జిల్లా జనాభాలో 10శాతం ఉండగా, అనధికారికంగా 20శాతం వరకు చేరుకోవచ్చని ఆరోగ్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

అందుబాటులో కాంబినేషన్ డ్రగ్..
షుగర్, బీపీ రెండు రోగాలు ఉన్నవారికి కాంబినేషన్ డ్రగ్ అవసరం. గతంలో ఆ ట్యాబ్లెట్లు కొనుగోలు చేసే స్తోమత లేని పేదలు ఇబ్బందిపడుతూ వచ్చారు. గతేడాది వరకు ప్రభుత్వం షుగర్, బీపీ వేర్వేరుగా ఉన్న వారికి మాత్రమే మందులు ఉచితంగా పంపిణీ చేస్తూ వచ్చింది. దీంతో కాంబినేషన్ డ్రగ్ అవసరం లేకున్నా, కొందరు బయట కొనుగోలు చేసేవారు. ఆర్థిక స్తోమత లేని వారు ఏదోలా కాలం వెల్లదీశారు. దీంతో కిడ్నీ సంబంధ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రాంతాల్లో డయాలిసిస్ సెంటర్లు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 65మంది కిడ్నీ వ్యాధితో డయాలిసిస్ చేసుకుంటున్నారు. ఇవి అవసరాన్ని బట్టి 24గంటలు పని చేస్తున్నాయి. కిడ్నీ సంబంధిత రోగుల సంఖ్య కూడా పెరిగిపోతుంది. గతేడాది నుంచి ప్రభుత్వం కాంబినేషన్ డ్రగ్స్ పంపిణీ చేస్తుంది. దీంతో ఒక్కో రోగికి ప్రతినెలా రూ.1,500వరకు లబ్ధి చేకూరుతుంది. కాంబినేషన్ డ్రగ్ ఉచితంగా పంపిణీ చేస్తుండడంతో భవిష్యత్‌లో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం

బీపీ, షుగర్ రెండు ఉన్న వ్యాధిగ్రస్తులకు గత సంవత్సరం నుంచి ప్రభుత్వం కాంబినేషన్ డ్రగ్‌ను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ మందుపై ఎంత మందికి అవగాహన ఉందో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాం. చాలా మందికి అవగాహన ఉంది. బీపీ, షుగర్ రోగులకు కూడా ప్రతి నెలా మందులు పంపిణీ చేస్తున్నాం. వ్యాధిగ్రస్తులు మందులను సద్వినియోగం చేసుకోవాలి.

– తుకారాం భట్, డీఎంహెచ్‌వో

బడుల బాగుకు నూతన ఒరవడి..!

బడుల బాగుకోసం ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. విద్యార్థుల ప్రగతిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశాల్లో గతంలో కంటే ఇప్పుడు తల్లిదండ్రులు అధికంగా హాజరవుతున్నారు. తమ పిల్లల విద్యా సమస్యలపై ప్రశ్నిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఉత్సాహంగా విద్యా బోధన చేస్తున్నారు.

- 'పేరెంట్స్–టీచర్స్' మీటింగ్‌లతో సత్ఫలితాలు
- ప్రతి నెలా మూడో శనివారం సమావేశాలు
- విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల చర్చ



గోయగాం ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న టీచర్స్, పేరెంట్స్ మీటింగ్

కెరమెరి: విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ వినూత్న ప్రయోగాలకు నాంది పలికింది. సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా అధికారులు ఎప్పటికప్పుడు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇక ప్రతి నెలా మూడో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సమావేశాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు – 721ఉండగా.. కేజీబీవీలు – 15, మోడల్ పాఠశాలలు – 2, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ – 1 ఉన్నాయి. ఇందులో సుమారు 45వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం..
విద్యార్థుల ప్రగతితో పాటు పాఠశాల సంస్థాగత పరమైన అభివృద్ధికి తల్లిదండ్రులను పాఠశాల విద్యాశాఖా భాగస్వామ్యం చేస్తోంది. పాఠశాలలను తల్లిదండ్రులు, సమాజంతో అనుసంధానం చేయడం ద్వారా, ఉత్తమ ఫలితాల సాధనకు అవసరమైన చర్యలకు ప్రణాళికలు రచించి, అమలు పరుస్తున్నారు. తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతి, వారి విద్యాసామర్థ్యం, బలాలు, బలహీనతలు, ఇలా అనేక రకాలైన అంశాలపై చర్చిస్తున్నారు. దీంతో సమావేశాలకు హాజరయ్యే తల్లిదండ్రుల సంఖ్య కూడా పెరుగుతుంది. విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరిస్తూ, విద్యార్థుల జీవితానికి అనుసరించాల్సిన విధానాలను తెలుపుతున్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలు..
ప్రతి నెలా అమ్మఆదర్శ కమిటీల సమావేశాలతో పాటు వీటిని సైతం తప్పనిసరిగా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా తరగతుల వారీగా తల్లిదండ్రులు, టీచర్స్ సమావేశాలను మూడో శనివారం నిర్వహిస్తున్నారు. ఒక వేళ మూడో శనివారం సెలవు అయితే, నాల్గో వారం నిర్వహించుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. సమావేశాల్లో విద్యా ప్రమాణాలు, పాఠశాలల్లో సౌకర్యాలు, ఎండీఎం మెరుగుపర్చడం తదితర అంశాలపై తల్లిదండ్రుల సూచనలు స్వీకరిస్తున్నారు. హెచ్‌ఎంలు చొరవ తీసుకొని అన్ని తరగతులు, పేరెంట్, టీచర్ సమావేశాలు సవ్యంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు లిఖిత పూర్వక సమావేశం ద్వారా తల్లిదండ్రులను సమావేశాలను ఆహ్వానిస్తున్నారు.

పురోగతిపై చర్చలు..
విద్యార్థుల విద్యాభివృద్ధి, పురోగతిపై క్రమం తప్పకుండా చర్చలు జరపడం ద్వారా వారికి అందించాల్సిన మద్దతు, సాయం, రోజువారీ హోం వర్క్, పాఠ్యపుస్తకాల వినియోగం, అసైన్‌మెంట్లు, పిల్లల ప్రవర్తన అలవాట్లు, ఆసక్తులు, మొదలైన వాటిపై ఎప్పటికప్పుడు సమీక్షించుకునేందుకు అవకాశం ఏర్పడుతోంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సామరస్య వాతావరణం ఏర్పడుతోంది. విద్యార్థుల హాజరు మెరుగుపడుతుంది. విద్యార్థుల ప్రవర్తన, సమస్యలు తెలుస్తున్నాయి. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా మధ్యాహ్న భోజనం అమలుపై పర్యవేక్షణ మరింత మెరుగు పడుతుంది. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో తల్లిదండ్రులు సైతం కీలక భూమిక పోషించేందుకు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఎంతో ఉపయోగపడుతుంది.

వీడ్కోలులోనూ వివక్షే..!

- పూర్తి సర్వీస్ చేసిన కార్మికులకే సన్మానం
- మెడికల్ అన్‌ఫిట్ అయితే ఉత్త చేతులతోనే ఇంటికి..
- సింగరేణి ద్వంద్వ విధానంపై విమర్శలు



రిటైర్ అయినవారిని సత్కరిస్తున్న అధికారులు(ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికులపై వివక్ష కొనసాగుతోంది. ఇప్పటికే హెల్త్ స్కీం విషయంలో అధికారులకు ఒక విధంగా, కార్మికులకు మరోలా పథకం అమలు చేస్తున్నారు. ఇన్సూరెన్స్ కవరేజీ పరిమితిలో వ్యత్యాసం ఉంది. తాజాగా కార్మికులు విరమణ విషయంలోనూ వివక్ష యాజమాన్యం సరికొత్త నిబంధన అమలు చేస్తోంది. పూర్తి సర్వీస్ పనిచేసి(సూపరాన్యూషన్)రిటైర్ అయిన వారినే కంపెనీ అధికారికంగా సన్మానిస్తుంది. సాధారణంగా రిటైర్మెంట్ రోజున అధికారులు రిటైర్ అయిన కార్మికుడిని సతీసమేతంగా తోటి కార్మికుల సమక్షంలో సత్కరిస్తారు. జ్ఞాపిక బహూకరించి, సంస్థకు అందించిన సేవలను కొనియాడతారు. ఘనంగా వీడ్కోలు పలుకుతారు. ఈ కార్యక్రమం ఎంతో ఆడంబరంగా జరుగుతుంది. రిటైర్ అయ్యే కార్మికులు ఈ రోజు కోసం ఆశగా ఎదురు చూస్తారు. గర్వంగా రిటైర్ కావాలని ఆశిస్తారు.30 ఏళ్లకుపైగా సంస్థలో పనిచేసి రిటైర్ అయ్యే రోజున నిర్వహించే సన్మాన కార్యక్రమంతో వెలకట్టలేని ఆనందం పొందుతారు. ఆరోజును ఓటీపీ జ్ఞాపకంగా మదిలో పదిలం చేసుకుని ఇళ్లకు వెళ్తారు. అయితే సింగరేణి వివక్షతో ఈ జ్ఞాపకం మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులకు దక్కడం లేదు. వారికి సన్మానం గానీ, వీడ్కోలు గానీ నిర్వహించడం లేదు.

జబ్బుతో దిగిపోతే పట్టించుకోరా..?
జబ్బుతో తాము దిగిపోవడమే సన్మానికి అడ్డంకిగా మారిందా అని మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా 30 ఏళ్ల సేవలు అందించామని, అయినా తమపై ఈ వివక్ష ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సంస్థ కోసం రక్తాన్ని చెమటగా మార్చి శ్రమించి వృద్ధాప్యంలో వ్యాధుల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయి విధులకు దూరమవుతున్నామని చెబుతున్నారు. బావుల్లో శ్రమతో కీళ్లనొప్పులు, నడుం నొప్పులు, ఊరితిత్తుల వ్యాధులు, బీపీ, గుండె జబ్బులు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. రిటైర్మెంట్‌తోపాటు ఈ జబ్బులు తమకు బోనస్‌గా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గని ప్రమాదాలు, బయట జరిగే ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డవారు కూడా తాము ఇక పని చేయాలేమంటూ మెడికల్‌బోర్డుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. జబ్బుల తీవ్రతను బట్టి కంపెనీ అన్‌ఫిట్(ఇన్‌వాలిడేషన్) చేస్తుంది. అన్‌ఫిట్ అయిన కార్మికులను యాజమాన్యం గౌరవంగా ఇంటికి పంపడం లేదు. అప్పటి వరకు చేసిన సర్వీసును గుర్తించైనా తోటి ఉద్యోగుల సమక్షంలో సన్మానం చేయాలి. కానీ అది ఏమాత్రం చేయడం లేదని పేర్కొంటున్నారు.

నోరు మెదపని సంఘాలు..
కంపెనీలో ఈ ద్వంద్వ విధానం ఏళ్లుగా కొనసాగుతున్నా.. ఏ కార్మిక సంఘం దీనిపై నో రు విప్పడం లేదు. గతంలో అన్‌ఫిట్ అ య్యేవారు తక్కువగా ఉండే వారు. వారి నుంచి పెద్దగా డిమాండ్ రాలేదు. కానీ ఇప్పుడు కంపెనీలో దిగిపోయేవారిలో సగం మంది కంటే ఎక్కువే మెడికల్ అన్‌ఫిట్ కార్మికులే ఉంటున్నారు. సంస్థకు అప్పటి వరకు చేసిన సేవలను యాజమాన్యం గుర్తించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తున్నారు. సర్వీసు పూర్తిచేసి రిటైర్ అయిన(సూపరాన్యుషన్)తోపాటు మెడికల్ అన్‌ఫిట్(మెడికల్ ఇన్‌వాలిడేషన్) అయిన వారి ని అధికారికంగా సన్మానించాలని సీనియర్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యంతో చర్చించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ లెటర్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఎంపిక చేసిన వారికి వెంటనే లెటర్లు ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మొత్కూరి కొమురయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీ ప్రక్రియ చేపట్టి ఎంపికైన వారికి ఇంకా లెటర్లు ఇవ్వకుండా జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే లెటర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బ్లాస్టింగ్ కార్మికుల కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ)ఆధ్వర్యంలో బ్లాస్టింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఓసీపీపై యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బ్లాస్టింగ్ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా అగ్గు కిరణ్, కార్యదర్శిగా ఆకుల నరేశ్, ఉపాధ్యక్షుడిగా పెద్దింటి సుధాకర్, సహాయ కార్యదర్శిగా బండారి బండారి సత్తయ్య, కోశాధికారిగా సుద్దుల శంకర్, కమిటీ సభ్యులుగా తోట సురేశ్, బండారి సురేశ్, ఆకుల సుభాశ్, గొల్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

పిడుగుపాటుకు ముగ్గురికి స్వల్పగాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని సాలేగూడ గ్రామానికి బాన్నే సుజాత, మందబాయి, సావితలు పిడుగుపాటుకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..శనివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుపడగా గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వారిని జిల్లాకేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు.

కాలినడకన హజ్‌యాత్రకు..

వాంకిడి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన మహమ్మద్ అబ్దుల్ అబిద్ కాలినడకన హజ్‌యాత్రకు బయల్దేరాడు. ఆదివారం వాంకిడి చేరుకోగా, ముస్లిం పెద్దలు, యువకులు స్వాగతం పలికారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం మైనార్టీ సభ్యులు అబిద్‌తో కలిసి మహారాష్ట్ర సరిహద్దు గోయేగాం వరకు కాలినడకన వెళ్లి వదిలారు.

దీపం అంటుకుని ఇల్లు దగ్ధం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చిలాటిగూడలో ఆదివారం దీపం అంటుకుని ఇల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదరి కమల ఇంట్లో ఉదయం దేవుని గదిలో దీపం వెలిగించింది. తర్వాత పొలం పనికి వెళ్లింది. ఇంట్లో దీపం మంటలు పరదకు అంటుకున్నాయి. స్థానికులు అందించిన సమాచారంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలార్పివేశారు. ఇంట్లో 4 తులాలు బంగారం, రూ.80 వేల నగదు, 20 తులాలు వెండితోపాటు సరుకులు కాలిపోయాయి. రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

కోడిపందేల స్థావరంపై దాడులు

వేమనపల్లి: స్థానిక బెస్తవాడలో కోడిపందేల స్థావరంపై నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులో తీసుకోగా, మిగతా 11 మంది పరారయ్యారు. ఘటన స్థలం వద్ద 3 కోడిపుంజులు, మూడు కత్తులు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిండుకుండలు..



మహారాష్ట్రతోపాటు ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులు నిండుకుండలా మారింది. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులను పరిశీలించి.. పలు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీన్ని వీక్షించేందుకు పలువురు రావడంతో ప్రాజెక్టుల వద్ద సందడి నెలకొంది.

కడెంకు పోటెత్తిన వరద



కడెం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కడెం ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అప్రమత్తమైన అధికారులు పది వరద గేట్లు ఎత్తి 79,850 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఐదు వరద గేట్ల ద్వారా 18,381 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 694.675(6.285టీఎంసీ) అడుగులు ఉంది. అధికారులు ప్రాజెక్ట్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



'స్వర్ణ'నాలుగు గేట్లు ఎత్తివేత



సారంగపూర్: మండలంతోపాటు మహారాష్ట్రలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. అధికారులు ఆదివారం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484 టీఎంసీలు) కాగా, 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో 4 గేట్ల ద్వారా 80 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించారు. ఈఈ లక్ష్మి, డీఈ శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరో రెండు రోజులు వర్షసూచన ఉన్న నేపథ్యంలో ప్రజలు స్వర్ణ నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. పశువుల కాపర్లు, మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేఈలు మధుపాల్, దేవేందర్, తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

'మత్తడివాగు'మూడు గేట్లు..



తాంసి: తాంసి, తలమడుగు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం కురిసిన వర్షానికి మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. అధికారులు ఆదివారం మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో ద్వారా 16,660 క్యూసెక్కుల వరద నీరు రాగా, 3 గేట్లు ఎత్తి 17,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.20 మీటర్ల వద్ద నిల్వ ఉండేలా నీటిని వదిలేస్తున్నట్లు ఇంజినీర్ హరీశ్‌కుమార్ తెలిపారు.

'అడ', 'వట్టి' గేట్లు..



ఆసిఫాబాద్‌రూరల్: అడ ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి 3200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తి స్థాయి నీటిమట్టం 10.393 టీఎంసీలు (243 మీటర్లు) కాగా ప్రస్తుతం 5.809 టీఎంసీలు వాటర్ లెవల్ 237.700 మీటర్లుగా ఉంది. వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 360 క్యూస్కెల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 2.89 టీఎంసీలు (238.50 మీటర్లు) ప్రస్తుతం 2.329 టీఎంసీలు ఉంది. ఇన్ ఫ్లో 750 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో ద్వారా 360 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

గడ్డెన్నవాగుకు వరద



భైంసాటౌన్: గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ప్రాజెక్టులోకి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టానికి(358.40మీ) చేరుకుంది. అధికారులు రెండు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. గంటగంటకు వరదనీటి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు దిగువన ఆటోనగర్ బైపాస్‌రోడ్డు మార్గంలో వంతెన నీట మునగగా, ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపేశారు.

'కుంటాల'కు జలకళ



నేరడిగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కుంటాల జలపాతానికి వరద నీరు పోటెత్తింది. దీంతో జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఇక్కడి అందాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రకృతి సహజ సిద్ధమైన పచ్చని అడవి తల్లి ఒడిలో సెలయేళ్ల పరవళ్లు తొక్కుతున్న జలధారాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జాలువారే అందాలను చూసి వారు మంత్రముగ్ధులవుతున్నారు. జలపాతం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

సాత్నాల గేటు..



జైనథ్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాత్నాలలోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో అధికారులు ఆదివారం మొదటి గేటును ఎత్తారు. రెండవ గేటును 0.1 మీటర్ల ఎత్తులో ఎత్తి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీళ్లను వదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 1.24 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 285.70మీటర్ల ఎత్తులో 1.056టీఎంసీ నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు సమాచారం.

బొగ్గు గనుల వేలానికి వెళ్లొద్దు

- అలాట్‌మెంట్ పద్ధతిలో గనులు దక్కించుకోవాలి
- కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణ పరిధిలోని బొగ్గు గనుల వేలానికి సింగరేణి వెళ్లొద్దని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎన్టీయూసీ జాతీయ కమిటీ నాయకులు టి.శ్రీనివాస్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు పోషమల్లు మాట్లాడారు. బొగ్గు గనులు సింగరేణికి అలాట్‌మెంట్ కోసమే కంపెనీ కృషి చేయాలన్నారు. గత నెల 28న యాజమాన్యం జాతీయ సంఘాలను పిలిచి వేలంలో పాల్గొనేలా సహకరించాలని కోరడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొంటే సంస్థ భవిష్యత్తులో ప్రైవేట్ సంస్థలతో పోటీపడలేదన్నారు. తెలంగాణ ప్రాంతంలో గనులు సింగరేణికే అలాట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేలాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ నేతలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సాక్షాత్తు డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వేలంలో పాల్గొనడాన్ని ఖండిస్తున్నామన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. వేలంలో పాల్గొనవద్దని, అలాట్‌మెంట్ పద్ధతిలోనే గనులు దక్కించుకోవాలని కోరుతూ ఈనెల 11న చలో కొత్తగూడెం చేపట్టినట్లు తెలిపారు. కార్మికులు తరలివరావాలని కోరారు. అలాగే శ్రావణ్‌పల్లి గనితోపాటు కోయగూడెం, సత్తుపల్లి గనులను సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు సారయ్య, ఐఎఫ్‌టీయూసీ నాయకులు చాంద్ పాషా, ఏఐఎఫ్‌టీయూ నాయకులు రాములు, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కుమార్‌స్వామి, జైపాల్‌సింగ్, టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మణిరాం సింగ్, రాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు రాములు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్టు

మంచిర్యాలక్రైం: కిరాణా షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని గోపాలవాడ చెందిన వొడ్నాల నరేశ్‌కు వేములబస్తీలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. గతనెల 31న రాత్రి షాపు తాళం వేసి ఉండడాన్ని ముగ్గురు గమనించారు. తాళం పగులగొట్టి రూ.5 వేలు నగదు, రూ.10 వేల విలువ గల సిగరేట్ డబ్బాలు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉన్న వారిని తనిఖీ చేశారు. వారివద్ద సిగరేట్ డబ్బలు లభించాయి. వారిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2500 నగదు, సిగరేట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ బన్సిలాల్, ఎస్సై సురేశ్, సిబ్బందిని డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన టేకం గణేశ్ (35) శనివారం ఉదయం పశువుల మేతకు వెళ్లాడు. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గ్రామ సమీపంలో ఒర్రెలో నీటి ప్రవాహం ఎక్కువ ఉంది. కాసేపు అక్కడే ఉన్న తర్వాత ఒర్రె దాటుతుండగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు రాత్రి గాలించిన ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటికి తీశారు. తండ్రి భీము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పాతమంచిర్యాల: వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో మాతాశిశు ఆస్పత్రిని ఆదివారం ఆయన సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో గర్భిణులు, 15 రోజుల్లో ప్రసవానికి ఉన్నవారిని ఆస్పత్రిలో చేర్పించాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర సేవల కోసం రెండు అంబులెన్సులు సిద్ధంగా ఉంచామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

నమూనా పరీక్షల నిర్వహణకు నిధులు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్లకోసారి జాతీయ సాధన సర్వే(న్యాస్) నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు జాతీయస్థాయిలో నవంబర్ 19న ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. విద్యార్థులు మంచి అవగాహనతో పరీక్ష రాసేలా 3, 6, 9 చదివే విద్యార్థులకు సెప్టెంబర్ 10, సెప్టెంబర్ 30, నవంబర్ 8న మూడు నమూనా పరీక్షలు నిర్వహించనున్నారు. నవంబరు 19న నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్షలో మంచి ప్రతిభ చాటానికి మూడు దఫాలు నిర్వహించే నమూనా పరీక్షలు ఉపయోగపడనున్నాయి. ఇందులో భాగంగా పరీక్షల ప్రశ్నపత్రాల ముద్రణ కోసం అడ్వాన్స్‌గా జిల్లాకు రూ.56,002 లక్షలు మంజూరు చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈ ఏడాది నవంబర్ 19న నిర్వహించే న్యాస్‌కు జిల్లాలో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి ఖేల్‌ఖూద్ పోటీలు



క్రీడాపోటీల్లో ప్రతిభ చాటుతున్న క్రీడాకారుడు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామం చొక్కారాంనగర్ రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి(రాష్ట్ర స్థాయి) క్రీడా పోటీలు ఆదివారం రెండోరోజు కొనసాగాయి. పలు క్రీడాంశాల్లో పాల్గొంటున్న క్రీడాకారులు తమ క్రీడా స్ఫూర్తి చాటుతూ రాణిస్తున్నారు. సోమవారంతో పోటీలు ముగియనున్నాయి. క్రీడా పోటీలను శ్రీసరస్వతీ విద్యాపీఠం తెలంగాణ సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ కె.విష్ణువర్ధన్‌రావు, తెలంగాణ ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రాంత అకాడమిక్ ఇంచార్జీ కృష్ణమాచార్యులు, ప్రాంత ఖేల్‌ఖూద్ ప్రముఖ్ భీంసేన్‌రావు, ఖేల్ ఖూద్ ప్రబంధకులు పర్యవేక్షిస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకుడు కందికట్ల మధుకుమార్ కూతురు కందికట్ల సహస్ర బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు అకాడమీ నిర్వాహకుడు మధు తెలిపారు. ఈ నెల 14, 19 తేదీల్లో కోల్‌కతాలో నిర్వహించే అండర్–13 సబ్ జూనియర్స్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో సహస్ర పాల్గొంటుందని తెలిపారు. సహస్రను జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.



సహస్రను అభినందిస్తున్న జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్

రాష్ట్రస్థాయి వుషూ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై


రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని ఎమ్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వుషూ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ పోటీలను ప్రారంభించారు. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవాటవుతుందన్నారు. పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో వుషూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, కార్యదర్శి అబ్దుల్ ఉమర్, కోశాధికారి యాకూబ్, అశోక్ లడ్డా, పోలం సత్యం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్తారింటి వేధింపులు తాళలేక జైపూర్ మండలం కుందారం చెందిన వివాహిత పురుగుల మందు తాగింది. కడుపునొప్పి బాధ భరించలేక చెన్నూర్‌లో వివాహిత ఉరేసుకుంది. బెజ్జూర్ మండలం సిద్దాపూర్‌కు చెందిన ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉరేసుకుని వివాహిత..

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడకు చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాలు.. భీమారం మండలం కాజిపల్లికి చెందిన మంజుల (35), చెన్నూర్‌కు చెందిన కడవండి మహేశ్‌ను ప్రేమించి గత 17 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి ముగ్గురు కుమారులు. మహేశ్ తాపీమేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెళ్లినాటి నుంచి తల్లిదండ్రులతో సంబంధాలు లేవు. కాగా, గత రెండేళ్లుగా మంజల కడుపునొప్పితో బాధపడుతుంది. ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది.



మంజుల మృతదేహం

వేధింపులతోనే..

నా బిడ్డ కడుపు నొప్పితో మృతి చెందలేదని, భర్త మహేశ్ వేధింపులతోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి గోదారి లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

అత్తారింటి వేధింపులకు వివాహిత..

జైపూర్: వరకట్నం తేవాలని అత్తారింటి వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం..జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన దాసరి శరణ్య(19) కుందారం గ్రామానికి చెందిన దాసరి సతీశ్, శరణ్యలది ఎదురెదు ఇళ్లు. వీరిది ఒకే కులం కావడం, ఒకరికొకరు ఇష్టపడ్డారు. గతేడాది మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆరు నెలలు గడవముందే ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కట్నం కోసం సతీశ్ కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసేవారు. మనస్తాపం చెందిన శరణ్య గతనెల 25న పురుగుల మందు తాగింది. మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, శరణ్య పురుగుల మందు తాగక ముందు రెండ్రోజుల క్రితం సతీశ్ ఆత్మహత్యకు యత్నించాడు. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.



శరణ్య(ఫైల్)

పురుగుల మందు తాగి ఒకరు..

బెజ్జూర్: మండలంలోని సిద్దాపూర్‌కు చెందిన టాకిరే వసంత్ (48) శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. భార్య నిర్మల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.